పోరు బాట..!

తరం మారుతున్నది..!
స్వరం పెరుగుతున్నది..!!

పాలకులు పట్టించుకోకపోతే..
సమస్యలను పరిష్కరించకపోతే..
'మా ఖర్మ ఇంతే'ననుకున్నది నాటి తరం..!

మీరు సత్పాలకులుగా ఉండకపోతే..
మీరు దుష్పాలకులుగా మారితే ..
'మీ ఖర్మ కాలినట్టే'నంటున్నది నేటి తరం..!!

తరం మారుతున్నది..!
స్వరం పెరుగుతున్నది..!!
సమరం సాగుతున్నది..!!!

నల్ల చట్టాలను రద్దు చేయాలని.. వేతన బకాయిలు ఇవ్వాలని.. బడ్జెట్ సరిపడా కేటాయించలేదని.. విద్యారంగాన్ని విస్మరిస్తున్నారని.. స్థానిక సమస్యలను పట్టించుకోవట్లేదని..
ఇలా– కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, సామాన్యులు.. అందరూ పోరు బాట పడుతున్నారు. వీరంతా, బుధవారం రోజున జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విభిన్న రూపాల్లో రోడ్ల మీదకు వచ్చారు.

అశ్వారావుపేట:మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు

దమ్మపేట: ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నల్ల చట్టాలపై నిరసన

అశ్వారావుపేట/అశ్వారావుపేటటౌన్/దమ్మపేట/ఇల్లెందు, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలన్న డిమాండుతో కార్మిక సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం జిల్లాలో వివిధచోట్ల ఆందోళనకు దిగారు. ప్రదర్శనలు, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాల సమర్పణ, నల్ల బ్యాడ్జీలు ధరించడం తదితర రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు నరాటి ప్రసాద్, పోతుగంటి లక్ష్మణ్, నిమ్మల మధు, కుంజా కృష్ణ, మరాటి రమేష్, ఎండీ యూసుఫ్ సలీమ్,అమర్లపూడి రాము, పిట్టల అర్జున్, సుంకరపాక ధర్మా, పండూరి వీరబాబు, జగదీష్, మల్లేష్, ఐ.వెంకటేశ్వర్లు, కృష్ణ, జేవీ చారి, అంజయ్య, నాగరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

అశ్వారావుపేట/దమ్మపేట రూరల్, ఫిబ్రవరి 5: ఐదు నెలల వేతన బకాయిలు ఇవ్వాలన్న డిమాండుతో అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయాల ఎదుట వేర్వేరుగా ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అర్జున్, కార్మికులు కృష్ణవేణి, జ్యోతి, నాగమణి, సీత, యామిని, మహాలక్ష్మి, పద్మ, విజయ, రమాదేవి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 5: వ్యవసాయ రంగాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సంయుక్త కాసాన్ మోర్చా పిలుపు మేరకు ఆళ్లపల్లిలో అఖిల పక్షం నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పాపారావు, ప్రసాద్, చంద్రయ్య, రమేష్, వెంకన్న, గోపాల్, సత్యం, వెంకటేశ్వర్లు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడాలని విద్యార్థుల ర్యాలీ

భద్రాచలం, ఫిబ్రవరి 5: విద్యారంగాన్ని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలన్న డిమాండుతో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం భద్రాచలం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, నాయకులు నర్సింహారావు, కాంపాంటి పృథ్వి, భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు వెలగడం లేదని ధర్నా

చర్ల, ఫిబ్రవరి 5: మండలంలోని ఆదివాసీ గ్రామమైన తిప్పాపురంలో మూడు నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలన్న డిమాండుతో అక్కడి ఆదివాసీలు బుధవారం ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు కారం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న రైతు కూలీలు, నాయకులు

భద్రాచలం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇల్లెందు: నిరసన తెలుపుతున్న ఆర్టీసీ సిబ్బంది

చర్ల: ధర్నా చేస్తున్న ఆదివాసీలు

'అమ్మ పేరుతో మొక్కలు నాటాలి'

ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 5: అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని లక్ష్మీదేవిపల్లి (ఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ విద్యార్థులను కోరారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా మొక్కలు నాటడం వల్ల ప్రతి ఒక్కరికీ తమ మాతృమూర్తిపై ఎంతటి ప్రేమ ఉందనే విషయం తెలుస్తుందని అన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాధాన్యం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జే.మాధవి, అరుణకుమారి, కొండలరావు, రమేష్, కామేశ్వరరావు, స్వరూపరాణి, శ్రీదేవి, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.65 వేలు మోసపోయిన యువతి

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 5: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న ఓ యువతి రూ.65 వేలు కోల్పోయింది. ఈ ఘటన మండలంలోని తోగ్గూడెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తోగ్గూడేనికి చెందిన ఇరపా మానస ఈ నెల 3న ఆన్‌లైన్ చాటింగ్‌లో ఉండగా ఒక కంపెనీ నుంచి కాల్ వచ్చింది. బిజినెస్ లోన్ ఇస్తామంటూ ఆ కంపెనీ ప్రతినిధులు నమ్మించారు. లోన్ పొందేందుకు నగదు చెల్లించాలని సూచించారు. వారి మాటలను నమ్మిన మానస.. రెండు రోజుల్లో మొత్తం రూ.65 వేలు చెల్లించింది. తర్వాత వారి నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని భావించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై సురేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

సింగరేణి కొత్తగూడెం ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్

ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రామవరం, ఏప్రిల్ 5: కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సింగరేణి కొత్తగూడెం ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇటీవల రామవరం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రతిపాదనలపై అధికారుల పరిశీలనకు రావడంతో.. ఈ ప్రాంతంలోని ఖాళీ స్థలాలన్నీ కబ్జాలకు గురవుతున్నాయి. ఇందులో భాగంగా రామవరం ఆర్‌టీఏ టెస్టు గ్రౌండ్ పక్కన ఉన్న స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. విషయం తెలుసుకున్న సింగరేణి అధికారులు గతంలోనే బోర్డు పాతారు. అయినప్పటికీ కబ్జా రాయుళ్లు ఆ బోర్డును తొలగించారు. దీంతో సమాచారం అందుకున్న సింగరేణి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, ఎస్టేట్ అధికారి తావుర్యా, ఇతర అధికారులు బుధవారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతం సింగరేణి పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. ఎవరైనా కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించబోమంటూ అక్కడున్న కబ్జాదారుడిని హెచ్చరించారు. సింగరేణి అధికారులు రాజయ్య, త్రిపాఠి, హానోక్ రాజు, సీతారాం, రాంబాబు పాల్గొన్నారు. అయితే, ఇటీవల ఈ ప్రాంతంలో ఓ నాయకుడు.. సింగరేణి క్వార్టర్లను ఆక్రమిస్తున్నాడని, ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది పనులకు ఆటంకం కలిగిస్తున్నాడని, మితిమీరిన జోక్యానికి పాల్పడుతున్నాడని స్థానికులు, అధికారులు అంటున్నారు.

న్యాయం చేయాలని రైతుల వినతి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 5: తమకు చెందిన భూములను కొందరు దొడ్డిదారిన స్వాధీనపర్చుకునేందుకు, తప్పుడు పత్రాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండలంలోని సత్యనారాయణపురం గ్రామ రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం ఇచ్చారు.

'కోలిండియా క్రికెట్'లో సింగరేణి జైత్రయాత్ర

వరుసగా రెండు మ్యాచ్‌లలో విజయంతో సెమీఫైనల్‌కు..

క్రికెట్‌లో టోర్నీలో ప్రతిభ కనపర్చిన సింగరేణి జట్టు

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 5: మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరుగుతున్న కోలిండియా క్రికెట్ టోర్నమెంట్‌లో సింగరేణి జట్టు చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. కోలిండియా పరిధిలోని మొత్తం 10 బొగ్గు సంస్థల జట్లు తలపడుతున్న ఈ టోర్నీలో గ్రూప్–ఏలో సింగరేణి సహా ఎన్‌సీఎల్, ఎంసీఎల్ ఉన్నాయి. గ్రూప్–బీలో సీసీఎల్, ఎస్‌ఈసీఎల్, సీఎంపీడీఐఎల్, గ్రూప్–సీలో డబ్ల్యూసీఎల్, ఈసీఎల్, సీఐఎల్, బీసీసీఎల్ జట్లు ఉన్నాయి. ఈ నెల 3న ఎంసీఎల్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో సింగరేణి జట్టు 28 పరుగుల తేడాతో గెలుపొందింది. బుధవారం జరిగిన పోటీల్లో 3 వికెట్ల తేడాతో విజయఢంకా మోగించి సింగరేణి జట్టు అగ్రస్థానంలో నిలిచింది. దీంతోపాటు సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. సింగరేణి జట్టు విజయంలో బ్యాట్‌మెన్స్ శశికాంత్, శశ్వంత్, ఆల్ రౌండర్ హరికిషన్, బౌలర్లు యుగంధర్, మహేశ్ కీలకపాత్ర పోషించారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా సదస్సు

ఇల్లెందు, ఫిబ్రవరి 5: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల వేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విఠల్‌రావు భవన్‌లో సంయుక్త సదస్సు జరిగింది. నాయకులు ఆలేటి కిరణ్‌కుమార్, బంధం నాగయ్య, కొక్కు సారంగపాణి, మల్లెల వెంకటేశ్వర్లు, కె.సారయ్య, అబ్దుల్ నబి, తుపాకుల నాగేశ్వరరావు, రాజు, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నర్సరీల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని వివిధ గ్రామాల్లో నర్సరీలను ఎంపీడీవో మహాలక్ష్మి బుధవారం పరిశీలించారు. మొక్కల సంరక్షణపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు.

పాఠశాల సందర్శన

టేకులపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలను ఎఫ్ఎల్ఎన్ బాలమేళా బృందం బుధవారం సందర్శించింది. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించింది. కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్, పాఠశాల హెచ్ఎం జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

టేకులపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని బేతంపూడిలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక నాయకుడు కోరం సురేందర్ బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటాలని కోరారు.

ఐలయ్యకు నివాళి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 5: ఇటీవల మృతి చెందిన సీపీఎం నేత సంతాప సభ బుధవారం ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య, నాయకులు చిరంజీవి నాయుడు, సోడెం ప్రసాద్, మడకం గోవిందరావు, కలపాల భద్రం తదితరులు నివాళులర్పించారు.

నులి పురుగుల నివారణపై 'టాస్క్ ఫోర్స్'

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 5: నులి పురుగుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'టాస్క్ ఫోర్స్' ఏర్పాటైంది. ఇది బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశమైంది. ఇది కొమరారం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత, ఎంపీడీవో ధన్‌సింగ్, ఎంపీవో చిరంజీవి, సీడీపీవో అరుణకుమారి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేట, ఫిబ్రవరి 5: మండలంలోని అనంతారం గ్రామ సమీపంలోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా అశ్వారావుపేటకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై యయాతి రాజు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం అడ్డుకుని స్వాధీనపర్చుకున్నారు. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వాటి యజమానులకు రూ.5వేల చొప్పున తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్ జరిమానా విధించారు.

పల్లె ప్రకృతి వనం ధ్వంసం

ధ్వంసమైన పల్లె ప్రకృతి వనం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 5: అశ్వారావుపేట మండలం మద్దికొండ గ్రామ శివారులోగల పల్లె ప్రకృతి వనాన్ని దుండగులు బుధవారం ధ్వంసం చేశారు. సగం మొక్కలను పూర్తిగా తొలగించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై యయాతి రాజు చెప్పారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు అభినందన

భద్రాచలం, ఫిబ్రవరి 5: తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చిలో ఇటీవల జరిగిన డైమండ్ సిల్వర్ జూబ్లీ జంబోరి కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు. అక్కడి నుంచి తిరిగొచ్చిన ఆ విద్యార్థులు.. ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్‌ను బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో కలుసుకున్నారు. వారిని ఏపీవో అభినందించారు. ఐటీడీఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇన్‌చార్జ్ నరేందర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో బాల మేళా

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని గుమ్మడవల్లి కాంప్లెక్స్ పరిధిలోగల కుముదులపాడు, గాడ్రాల పాఠశాలల్లో బుధవారం బాల మేళా కార్యక్రమం జరిగింది. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు టి.వీరేశ్వరరావు, సీఆర్‌పీ మాళోతు రామారావు, ఆర్‌పీ బి.హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఫిర్యాదుతో న్యాయవాదిపై కేసు

భద్రాచలం, ఫిబ్రవరి 5: పెళ్లి పేరుతో తనను మోసగించాడంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో న్యాయవాదిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓ మహిళ(28), తన భర్తతో గొడవల కారణంగా ఆయనకు దూరంగా ఉంటున్నది. తన భర్తపై చట్టపరంగా పోరాడేందుకు భద్రాచలానికి చెందిన న్యాయవాది భరణి వెంకట కార్తీక్‌ను సంప్రదించింది. న్యాయం జరిగేలా చూస్తానని చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెకు దగ్గరయ్యాడు. ఆయన ద్వారా ఆమె గర్భంధాల్చింది. తనను పెళ్లి చేసుకోవాలని కోరింది. దీనికి భరణి వెంకట కార్తీక్ నిరాకరించడంతోపాటు ఆమెను బెదిరించాడు. గర్భస్రావం చేయించుకోకపోతే సోషల్ మీడియాలో పరువు తీస్తానని హెచ్చరించాడు. దీంతో, ఆమె మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. భరణి వెంకట కార్తీక్‌పై పోలీసులు బీఎన్ఎస్ చట్టంలోని 69 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అతడి కోసం గాలిస్తున్నారు.

ఇసుక నిల్వలు స్వాధీనం

అశ్వారావుపేట (ములకలపల్లి), ఫిబ్రవరి 5: ములకలపల్లి మండలంలోని కేవీ రామవరం పంచాయతీ కొత్తూరు గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన 25 ట్రాక్టర్ ట్రక్కుల ఇసుకను గిర్దావర్ భద్రు నాయక్ బుధవారం స్వాధీనపర్చుకున్నారు. లారీల ద్వారా రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

ఇన్ఫార్మర్ నెపంతో ఆదివాసీ హత్య

చర్ల, ఫిబ్రవరి 5 : ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దంతెవాడ జిల్లా అరన్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాకారి గ్రామానికి చెందిన ఆదివాసీ హేమల హద్మాను ఇన్ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ మావోయిస్టులు పదునైన ఆయుధాలతో హత్య చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, **MAREBOINA PADMA** (OLD NAME) W/o. **SRINIVASA RAO** R/O. H.No.9-1-173/2B, Prashanthi Nagar, Laxmidevipalli Mandal, Bhadradri Kothagudem District, Telangana, Hereby changed my name as **P.PADMA** (NEW NAME) W/O. **SRINIVASA RAO** for all purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

వసతిగృహాల్లో జడ్జి భానుమతి ఆకస్మిక తనిఖీ

విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి భానుమతి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 5: కొత్తగూడెంలోని నాలుగు వసతిగృహాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'ఏ' పవర్‌హౌస్ బస్తీలోని కళాశాల బాలికల వసతిగృహం, పోస్టుమెట్రిక్ బాలిక వసతిగృహం, సింగరేణి మహిళా కాలేజీ ఎదురుగా ఉన్న బీసీ బాలికల వసతిగృహం, ప్రభుత్వ గిరిజన బాలికల వసతిగృహాలను తనిఖీ చేసి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని వార్డెన్లకు సూచించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్ రూమ్‌లను న్యాయమూర్తి పరిశీలించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెలర్ నిరంజన్ రావు, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు తదితరులుపాల్గొన్నారు.

15న కొత్తగూడెంలో సైన్స్ ఎక్స్‌పో: డీఈవో

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఫిబ్రవరి 5: తొలి అడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఈ నెల 15న సైన్స్ ఎక్స్‌పోను నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వరచారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి అడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది సైన్స్ ఎక్స్‌పోలో పలు అంశాలపై ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. వ్యవసాయం, ఆరోగ్యం ఆహారం, ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్, ఎన్విరాన్‌మెంట్ అండ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సైన్స్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అనే ప్రధాన అంశాలపై మాత్రమే విద్యార్థులు ఎగ్జిబిట్లను రూపొందించాలని సూచించారు. ఒక్కరోజు పాటు నిర్వహించే ఈ ఎక్స్‌పోకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత భోజన సౌకర్యం ఉంటుందని, విజేతలకు బహుమతులు ఉంటాయని వివరించారు. మరింత సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

కోలిండియా క్యారమ్స్ టోర్నీలో సింగరేణి జట్టు ప్రతిభ

అర్హత సాధించిన క్రీడాకారులు

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 5: జార్ఖండ్‌లోని రాంచీలో సీఎంపీడీఐఎల్ ఆధ్వర్యంలో కోలిండియా పరిధిలోని మొత్తం 10 బొగ్గు సంస్థల జట్లు తలపడుతున్న కోలిండియా క్యారమ్స్ టోర్నమెంట్‌లో బుధవారం నాటి పోటీల్లో సింగరేణి జట్టు చక్కటి ప్రదర్శనతో టీమ్ ఛాంపియన్షిప్ సాధించింది. డబుల్స్ విభాగంలో సింగరేణి క్రీడాకారులు బీ.శ్రీనివాస్ (భూపాలపల్లి ఏరియా), ఓ.మల్లేశ్ (బెల్లంపల్లి ఏరియా) రన్నర్లుగా నిలిచారు. సింగిల్స్ విభాగంలో క్రీడాకారుడు ఆర్.సృజన్‌రావు (శ్రీరాంపూర్) ఫైనల్స్‌కు అర్హత సాధించాడు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాలమహానాడు నాయకులు

పాల్వంచ, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని మాలలకు తీరని అన్యాయం చేసిందని జాతీయ మాలమహానాడు పట్టణ అధ్యక్షుడు దారా చిరంజీవి ఆరోపించారు. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో పాల్వంచలో బుధవారం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులంతా కలిసి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంఘం నాయకులు వాసుముళ్ల సుందర్‌రావు, దాసిరి నాగేశ్వరరావు, శనగా వెంకటేశ్వర్లు, నామా నవీన్, బర్ల వెంకటరత్నం, నామా పండు, పుట్టి వెంకటేశ్వర్లు, బాషబోయిన అశోక్, గుర్రం లక్ష్మయ్య, ముగిత్యాల భాస్కర్, జీవీ రత్నం, కోళ్లపూడి ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

11న 'దొడ్డి కొమరయ్య' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మాట్లాడుతున్న దర్శకుడు సేనాపతి

పాల్వంచ, ఫిబ్రవరి 5: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు 'దొడ్డి కొమరయ్య' సినిమా వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 11న పాల్వంచలోని బీసీ భవనంలో నిర్వహించనున్నట్లు చిత్ర దర్శకుడు సేనాపతి తెలిపారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దొడ్డి కొమరయ్య సినిమాని వెయ్యి మంది సహా నిర్మాతలతో నిర్మిస్తున్నామని, ప్రపంచ సినీ చరిత్రలో ఇదొక సంచలన సినిమాగా నిలవబోతున్నదని అన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

రామవరం, ఫిబ్రవరి 5: గుడుంబాను తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకొని బుధవారం కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ జయశ్రీ కథనం ప్రకారం.. జిల్లా టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన దాడుల్లో ఆరు లీటర్ల గుడుంబాను తరలిస్తున్న రుద్రంపూర్‌కు చెందిన మాలోత్ గీతకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గుడుంబాతోపాటు బైక్‌ను సీజ్ చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై ఆందోళన

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 5: స్థానిక కళాశాల నుంచి ఓ విద్యార్థిని నాలుగు రోజుల కిందట అదృశ్యమైంది. దీంతో, ఆమె కుటుంబీకులు.. బంధువులు బుధవారం ఆ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. కళాశాల బాధ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. తాము ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కళాశాల బాధ్యులు తెలిపారు. పోలీసులను సంప్రదించాలని సూచించారు. కొద్దిసేపటి తర్వాత ఆందోళన విరమించారు.